క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
15-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:207

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

కామన్ పాసుల గుదిబండ!



మెట్రో- ఆర్టీసీ కామన్ పాస్ ధరలపై ప్రజాగ్రహం

కమిటీలు వేస్తామంటున్న ప్రభుత్వం

కాలయాపన కోసమే అన్న అనుమానం

క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ బ్యూరో

భాగ్యనగరం వాసులకు ప్రజా రవాణాను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెట్రో రైల్ - ఆర్టీసీ కామన్ పాస్ ధరలు అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ విధానం సామాన్యులకు భారంగా మారింది. రోజువారి ప్రయాణికుల నుంచి వ్యక్తం అవుతున్న తీవ్ర నిరసనల కారణంగా.. ఈ ధరల పున పరిశీలన కోసం త్వరలోనే ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి చర్చిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

అయితే ఇంత చిన్న విషయానికి కూడా కమిటీని వేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంపై భిన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముందుగా అంతర్గత కమిటీలు వేసి.. నిర్ణయాలు తీసుకుని.. ధరల మార్పు ప్రకటించాల్సి ఉంది. అయితే ఇది కేవలం కాలయాపనకే తప్ప సమస్యకు పరిష్కారం కాదు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

- మిగతా 2వ పేజీలో

2047 నాటికి తెలంగాణ రూపురేఖలు మారుస్తారు..



తెలంగాణ టార్గెట్ 3 ట్రిలియన్ డాలర్లు.. రేవంత్ మాస్టర్ ప్లాన్ ఇదే!

2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరాలన్న లక్ష్యం

హైదరాబాద్ నుంచి పల్లెల వరకు మూడు ప్రత్యేక అభివృద్ధి జోన్లు

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచడమే ధ్యేయం

హైదరాబాద్, అక్టోబర్ 14: హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలు.. నగర శివార్లలో పరిశ్రమలు.. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత రంగాలు. ఇలా తెలంగాణలోని ఒక్కో ప్రాంతానికి ఒక్కో అభివృద్ధి బాధ్యత అప్పగిస్తూ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో

- మిగతా 2వ పేజీలో

సింగరేణిలో రూ.10 వేల కోట్ల కుంభకోణం?

కేటీఆర్ సంచలన ఆరోపణలు!

సింగరేణి వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరుగుతున్నాయన్న కేటీఆర్

నైని టెండర్ల రద్దుపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేత

సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లపైనా ఆరోపణలు

కిషన్ రెడ్డికి ఆధారాలతో లేఖ రాసినట్లు వెల్లడి

2లో

కమలంలో ఎమ్మెల్సీ కుస్తీ.. రాంచందర్‌రావుకే మొగ్గు?

తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై బీజేపీ ఫోకస్

హైదరాబాద్ స్థానం నుంచి బలంగా వినిపిస్తున్న రాంచందర్‌రావు పేరు

రెండు సీట్లకు పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్న ఆశావహులు

అభిప్రాయ సేకరణ పూర్తి చేసిన కమిటీలు.. త్వరలో అధిష్ఠానానికి నివేదిక

ఒక స్థానాన్ని బీసీ వర్గానికి కేటాయించే యోచనలో పార్టీ నాయకత్వం

జగన్ అక్రమాస్తుల కేసుల్లో కీలక మలుపు..

ఇక ప్రతిరోజూ కోర్టులో విచారణ

సీబీఐతో పాటు ఈడీ కేసుల విచారణకూ రోజువారీ షెడ్యూల్

జగన్‌తో సహా 70 మందిని వ్యక్తిగతంగా విచారించాలని నిర్ణయం

పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు

విచారణ వేగం పెంచాలని ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన ఈడీ

2లో

ఏపీలో ఎన్నికల సందడి..

ఏపీలో ఎన్నికల సమరానికి ముహూర్తం ఫిక్స్..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు అక్టోబర్ 28న పోలింగ్


నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

మూడు తేదీల్లో పల్లె ఓటింగ్.. నవంబర్ 26 నుంచి ప్రారంభం

షెడ్యూల్ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి



అమరావతి, అక్టోబర్ 14: ఏపీలో గ్రామం నుంచి పట్టణం వరకు





కామన్ పాసుల గుదిబండ!

ప్రభుత్వం ఈ విషయంలో విమర్శలను ఎదుర్కొంటుంది.

భారీగా పాసుల ధర..

ప్రస్తుత విధానం ప్రకారం నాలుగు వందల రూపాయలు ఉన్న రోజువారి కామన్ పాస్ .. ఏకంగా రూ.8,500 ఉన్న నెలవారి పాస్ ధరలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు మోయరాని భారంగా మారాయి. డైలీ టికెట్ కొనుక్కుని ప్రయాణం చేసినా అంత ఖర్చు కాదు. ఇలాంటి తక్షణ ఆర్థిక సమస్యలపై రాజకీయ నాయకుల హామీలు మాదిరిగా త్వరలో కమిటీ వేస్తాం, నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటాం అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ కమిటీ ఎప్పుడూ అధ్యయనం చేస్తుంది? ఆ కమిటీ ఇచ్చే నివేదిక పట్టి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుంది?



అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ఈ తాత్సారం ప్రదర్శించే లోపు.. ఇప్పటికే అధిక ధరలు చెల్లించి నెలవారి, రోజువారి పాసులు కొనుగోలు చేసిన ప్రయాణికుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

వారి పరిస్థితి ఏంటి?

ఒకవేళ ఈ పాసుల విషయంలో ప్రభుత్వం ధరలు తగ్గిస్తే.. ఇప్పటికే పాసులు తీసుకున్న వారి పరిస్థితి ఏంటి అనేది ఒక చిక్కుముడి. ఆ పాసులకు సంబంధించి రెఫండ్ ఇస్తారా లేదా అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. పాలకులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ప్రయాణికుల తక్షణ ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని.. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ధరల తగ్గింపు ప్రకటించాలని భాగ్యనగరం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా రవాణాను ప్రోత్సహించాలంటే కేవలం కామన్ పాసులు ప్రవేశపెట్టడం మాత్రమే కాకుండా.. అవి సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టకుండా అందుబాటు ధరల్లో ఉండేలా చూసే బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ఈ విషయంలో రేవంత్ సర్కార్ గుడ్డిగా ముందుకు వెళితే మాత్రం ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

2047 నాటికి తెలంగాణ రూపురేఖలు మారుస్తారు..



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలను ప్రకటించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మరో కార్యక్రమంలో గ్లోబల్ పెట్టుబడుల ప్రాధాన్యాన్ని వివరిస్తూ, తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ఆకర్షణీయమైన కేంద్రంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని వెల్లడించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉందని, దాన్ని పది శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

మూడు జోన్లు.. మూడు రకాల అభివృద్ధి

రాష్ట్రంలోని ప్రాంతాల స్వభావం, అవకాశాలను బట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు క్యూర్, ప్యూర్, రేర్ పేర్లతో మూడు జోన్లను రూపొందించనున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాన్ని ఐటీ, సేవారంగం, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యనున్న ప్రాంతాల్లో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, రవాణా-సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి పెట్టనున్నారు.

రాజకీయాల కంటే అభివృద్ధికే ప్రాధాన్యం

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలకు ప్రాధాన్యం ఉండాలని, అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని అన్నారు.

పెట్టుబడిదారులకు ఆహ్వానం

దాదాపు 400 ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం విభిన్న సంస్కృతులకు నిలయంగా ఎదిగిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు నగరం సాధించిన మార్పులను ప్రస్తావిస్తూ, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక వ్యాపారవేత్తలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక రంగంలో యువత, మహిళల భాగస్వామ్యం పెరగాలని, మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు ప్రారంభ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీలో ఎన్నికల సందడి..


రాజకీయ వేడి మొదలుకానుంది. స్థానికంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు ఎదురుచూస్తున్న ఓటర్లకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. పట్టణ సంస్థలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు వేర్వేరు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆశావహులు, రాజకీయ పార్టీల నాయకులు తమ వ్యూహాలకు పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

ముందుగా పట్టణాల్లో ఎన్నికల హడావుడి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో స్థానిక ఎన్నికల తేదీలను వెల్లడించారు. తొలి దశలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. అభ్యర్థులు అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అక్టోబర్ 19న వాటిని పరిశీలిస్తారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులకు అక్టోబర్ 21 వరకు గడువు ఉంటుంది. అక్టోబర్ 28న ఓటింగ్ నిర్వహించి, అక్టోబర్ 30న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

మండల, జిల్లా పరిషత్‌లకు నవంబర్‌లో పోలింగ్

రెండో దశలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జడ్పీటీసీ) స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 5న ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ



ఎన్నికల్లో స్థానికంగా బలాన్ని నిరూపించుకోవాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళికలు, స్థానిక సమీకరణాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పల్లెల్లో మూడు తేదీల్లో ఓటింగ్

గ్రామ పంచాయతీలకు మూడో దశలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. రిజర్వేషన్లకు సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగడంతో పాటు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడం ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

భారత్ ఎదుగుదలకు హద్దుల్లేవు..

ప్రపంచ వేదికపై జైశంకర్ కీలక సందేశం!

భారత్‌కు 'మధ్యస్థాయి శక్తి' అనే ముద్ర సరిపోదన్న విదేశాంగ మంత్రి

నాలుగు ట్రిలియన్ డాలర్లకు చేరిన దేశ ఆర్థిక వ్యవస్థ

ఆర్థిక ఆంక్షలూ అంతర్జాతీయ ఒత్తిడికి సాధనాలేనని వెల్లడి

భవిష్యత్తులో దేశాల మధ్య చర్చల తీరు మారుతుందని అంచనా

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ఒక దేశాన్ని అంచనా వేయాలంటే దాని ప్రస్తుత స్థితిని మాత్రమే చూడకూడదు.. రాబోయే రోజుల్లో అది సాధించగల అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. భారత్ విషయంలోనూ ఇదే వర్తిస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో ముందుకు సాగుతున్న భారత్‌ను 'మధ్యస్థాయి శక్తి'గా పేర్కొనడం దేశ సామర్థ్యాలను పరిమితం చేసినట్లేనని స్పష్టం చేశారు. బుధవారం జరిగిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్' చర్చలో పాల్గొన్న జైశంకర్‌కు భారత్‌ను మధ్యస్థాయి శక్తిగా ఎందుకు చూడకూడదనే ప్రశ్న ఎదురైంది. దీనిపై స్పందిస్తూ, దేశానికి ఉన్న విస్తృతమైన అభివృద్ధి అవకాశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. భారత్‌ను ఒక నిర్దిష్ట స్థాయికే పరిమితం చేసే నిర్వచనం సరైనది కాదని పేర్కొన్నారు. ఇతర దేశాలకు సాధికారత కల్పించే దేశాలను మధ్యస్థ శక్తులుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, భారత్‌ను అదే కోణంలో చూడటం సరిపోదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో కీలక మలుపు..

హైదరాబాద్, అక్టోబర్ 14: వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన కేసుల్లో ఇకపై ఏం జరగబోతోంది? ఏళ్ల తరబడి కోర్టుల్లో కొనసాగుతున్న ఈ వ్యవహారాలు ఇప్పుడు వేగం పుంజుకోనున్నాయా? మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను ప్రతిరోజూ చేపట్టాలని సీబీఐ కోర్టు నిర్ణయించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులపైనా రోజువారీ విచారణ జరగనుంది.

జగన్‌తో పాటు మరో 70 మంది

ఈ కేసుల్లో జగన్‌తో పాటు ఇతర నిందితులుగా ఉన్న మరో 70 మందిని కూడా వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయించింది. విచారణకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది.



ఈడీ కేసులపై హైకోర్టును ఆశ్రయించిన అధికారులు

జగన్‌కు సంబంధించిన వ్యవహారాల్లో దాదాపు పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విచారణ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈడీ అధికారులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లపై నిర్ణయాలు వెలువడకపోవడంతో కేసులు ముందుకు కదలడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

విచారణ వేగం పెంచాలని పిటిషన్లు

ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా కేసుల విచారణలో జాప్యాన్ని నివారించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.రోజువారీ విచారణతో కేసుల్లో తదుపరి న్యాయపరమైన ప్రక్రియ వేగవంతమవుతుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

కమలంలో ఎమ్మెల్సీ కుస్తీ.. రాంచందర్‌రావుకే మొగ్గు?



తెలంగాణలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముమ్మరం చేసింది. ఈసారి టికెట్ల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, ఎంపిక ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నేత ఎన్. రాంచందర్‌రావు పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ, పలువురు సీనియర్లు గట్టిగా లాబీయింగ్ చేస్తుండటంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది.ఈ రెండు స్థానాలకు సంబంధించి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు బీజేపీ రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ కమిటీలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలను స్వీకరించాయి. ఈ నివేదికలను బుధవారం రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల స్థానానికి సుమారు 13 మంది, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి ఏడుగురు నేతలు పోటీలో ఉన్నారు. హైదరాబాద్ స్థానానికి రాంచందర్‌రావుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, డోకూరి పవన్‌కుమార్, గౌతమ్ రావు, శ్రీవర్ధన్ రెడ్డి వంటి నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తన అనుచరుడైన పవన్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానం కోసం పీఆర్‌టీయూ నేత భిక్షంగౌడ్, పుల్లారావు యాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర నాయకత్వం కమిటీల నివేదికలను పరిశీలించి, ప్రతి స్థానానికి ముగ్గురి పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపనుంది. దసరా పండుగ తర్వాత తుది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ వ్యూహం ప్రకారం, ఒక స్థానాన్ని ఓపెన్ కేటగిరీకి, మరొకటి బీసీ వర్గానికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ఎన్నికలు జరగనున్నాయి.

సింగరేణిలో రూ.10 వేల కోట్లకుంభకోణం?

గోదావరిఖని, అక్టోబర్ 14: బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాల కోసం ఉండాల్సిన సింగరేణి సంస్థలో భారీ అక్రమాలు జరుగుతున్నాయనేది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాన ఆరోపణ. కొనుగోళ్లు, టెండర్ల వ్యవహారాల్లో పెద్ద మొత్తంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, సింగరేణి నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

సైట్ విజిట్ నిబంధనపై ప్రశ్నలు

అక్టోబర్ 14న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీఆర్ఎస్ నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో కేటీఆర్ ప్రసంగించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో తీసుకొచ్చిన నిబంధన వెనుక సుమారు రూ.10 వేల కోట్ల అక్రమాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. సోలార్ పరికరాలు, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లతో పాటు మరికొన్ని అంశాల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు.

నైని టెండర్ల రద్దుపైనా విమర్శలు

నైని టెండర్లను రద్దు చేయడంపై కూడా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కమిషన్ల పంపకాల్లో తేడాలు రావడంతోనే టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందని ఆరోపించారు. నైని వ్యవహారంలో రూ.30 వేల కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన



వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ పెద్దల మధ్య వాటాల విషయంలో ఏకాభిప్రాయం కుదరనప్పుడే ఇలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయని ఎద్దేవా చేశారు.

కేంద్ర మంత్రికి లేఖ రాశామన్న కేటీఆర్

సింగరేణిలో జరుగుతున్నాయని తాము భావిస్తున్న అక్రమాలపై ఆధారాలతో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఈ వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నాయకులు పరస్పరం ఒకరినొకరు కాపాడుకుంటూ సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలను కాపాడాలనే ఉద్దేశంతోనే తమ పార్టీ ఈ పోరాటాన్ని కొనసాగిస్తోందని తెలిపారు.

నల్గొండకు నీళ్ల విషయంలో ఒత్తిళ్లా?

సీఎం ముందే తేల్చాలన్న గుత్తా

నల్గొండ, అక్టోబర్ 14: సాగునీటి పంపకాల విషయంలో నల్గొండ, పాలమూరు ప్రాంతాల మధ్య నెలకొన్న వివాదానికి రాజకీయ స్థాయిలోనే పరిష్కారం కనుగొనాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. నల్గొండ రైతులకు నీళ్లు అందించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకూడదని స్పష్టం చేశారు. కొందరు అధికారులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెస్తూ జిల్లాకు నీటి కేటాయింపులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

డిండి ప్రాజెక్టుకు నీళ్లు ఎందుకు వద్దు?

నల్గొండలో మీడియాతో మాట్లాడిన గుత్తా.. నీళ్లన్నీ పాలమూరు ప్రాంతానికే కేటాయించాలని, డిండి ప్రాజెక్టుకు నీరు ఇవ్వకూడదని కొందరు వాదించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్గొండకు నీళ్లు ఎలా ఇస్తారంటూ ముఖ్యమంత్రిని అధికారులు ప్రశ్నించడం సరికాదని అన్నారు. సాగునీటి విషయంలో ప్రాంతాల మధ్య తేడాలు చూపకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. నల్గొండ జిల్లాలో ప్రస్తుతం సుమారు 7 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని గుత్తా తెలిపారు. మరోవైపు పాలమూరు ప్రాంతంలో 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లను ప్రారంభించినప్పటికీ, వాటికి నీటిని ఎక్కడి నుంచి సమకూర్చాలనే అంశంపై స్పష్టత లేదని వ్యాఖ్యానించారు.

కరెంటు లేదు.. నీళ్లు లేవు.. ఎండిపోతున్న వరి పంటలు

ఎండిన పంటలకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి

బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నర్సింహ రెడ్డి డిమాండ్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(కడ్తాల్): విద్యుత్ సరఫరా లేక, సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని, అన్నదాతల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నర్సింహ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో పలు వ్యవసాయ పొలాలను పరిశీలించిన ఆయన, తాను సాగు చేసిన ఐదెకరాల వరి పంట సైతం విద్యుత్ సమస్యతో ఎండిపోతుండటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రైతులు ఎంతో కష్టపడి, అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు కీలక సమయంలో నీరు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీ నర్సింహ రెడ్డి అన్నారు. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం, సాగునీటి కొరత ఏర్పడటంతో రైతులు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడే



పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వరి పంటలకు అవసరమైన సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి లభ్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకవైపు పెట్టుబడుల భారం, మరోవైపు విద్యుత్ సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆయన ఆరోపించారు.

ఎకరాకు రూ.లక్ష పరిహారం చెల్లించాలి...

ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, పంటలను కాపాడేందుకు అవసరమైన సాగునీటిని అందించాలని లక్ష్మీ నర్సింహ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.1,00,000 చొప్పున పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతల కష్టాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

గగన్‌పహాడ్ ప్రెస్టీజ్ సిటీ పక్కన ఉన్న ములగు చెరువు హద్దుల నిర్ధారణ ఎక్కడ.?

98.5ఎకరాల భూమి సర్వేనంబర్లు 80నుంచి90 వరకు,239లో సమగ్ర సర్వే చేపట్టాలి..

చెరువు శిఖం,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిని తేల్చాలి..

అధికారులకు గ్రామస్తుల వినతి..


గండిపేటక్రైమ్ మిర్రర్: చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో చెరువుల అసలు హద్దులు,వాటి పరిధిలోని భూముల వివరాలపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉందని గగన్‌పహాడ్ గ్రామస్తులు కోరుతున్నారు.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం గగన్‌పహాడ్ పరిధిలో ప్రెస్టీజ్ సమీపంలో ఉన్న ములగును లేక్(పెద్ద చెరువు),లేక్ ఐడీ2921కు సంబంధించి సమగ్ర భూసర్వే నిర్వహించి,చెరువు హద్దులను అధికారికంగా నిర్ధారించాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వే నంబర్లు80నుంచి90వరకు,239లో పరిశీలన..

ములగును చెరువుకు సంబంధించిన పరిధి,పరిసర భూములపై స్పష్టత కోసం సర్వే నంబర్లు 80,81,82,83,84,85,86,87,88,89,90తో పాటు 239లో క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.సంబంధిత రెవెన్యూ రికార్డుల ఆధారంగా భూముల విస్తీర్ణం,సరిహద్దులను పరిశీలించి,చెరువు పరిధికి సంబంధించిన వివరాలను అధికారికంగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువు-శిఖం,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌పై స్పష్టత ఏదీ.?

చెరువు పరిరక్షణలో భాగంగా చెరువు శిఖం భూములు,పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్),బఫర్



జోన్ పరిధిని శాస్త్రీయంగా, రికార్డుల ఆధారంగా నిర్ధారించడం కీలకమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.చెరువు హద్దులు, పరిసర భూముల మధ్య ఉన్న సరిహద్దులపై స్పష్టత లేకపోతే భవిష్యత్తులో భూవివాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరుతున్నారు.

పాత రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ..

గ్రామ మ్యాప్,టిప్పన్,సేత్వార్ తదితర రెవెన్యూ రికార్డులను పరిశీలించి,సదరు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు,చెరువు శిఖం భూములు లేదా చెరువు పరిధికి సంబంధించిన భూములు ఉన్నాయా అనే అంశాన్ని తేల్చాలని వినతిలో పేర్కొన్నారు. రికార్డులు,క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే వాటిని అధికారికంగా నమోదు చేసి,నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆక్రమణలు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి..

సర్వే సమయంలో చెరువు హద్దుల ఉల్లంఘనలు లేదా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తిస్తే,వాటిని సంబంధిత రికార్డులతో నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఏదైనా ఆక్రమణ ఉన్నట్లు నిర్ధారణ కాలేదని,అధికారిక సర్వే,రికార్డుల పరిశీలన ద్వారానే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

ఆర్‌డీఓ,తహసిల్దార్,లకు వినతి..

ములగును చెరువు పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణ దృష్ట్యా రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్,మండల తహసీల్దార్ బొమ్మ రాములు తక్షణమే స్పందించాలని గగన్‌పహాడ్ గ్రామస్తులు,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి,సూరెడ్డి సాయికృష్ణారెడ్డి, రవికుమార్,వెంకటేష్ గౌడ్,సాయి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసి వివరాలను వెల్లడించారు.మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు,అవసరమైన చెరువుల పరిరక్షణశాఖల సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి,చెరువు అసలు హద్దులు,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ వివరాలను అధికారికంగా నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సర్వే పూర్తయిన అనంతరం నివేదిక,సర్వే మ్యాప్,హద్దుల వివరాలను నిబంధనల ప్రకారం అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.చెరువు పరిరక్షణకు అధికారులు తీసుకునే చర్యలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.



బండ్లగూడలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

అర్హులైన లబ్ధిదారులకు కార్డులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

గండిపేటక్రైమ్ మిర్రర్: బండ్లగూడ డివిజన్--123 పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, నార్సింగి మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ తదితర నాయకులు పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం నిబంధనల ప్రకారం నిత్యావసర సరుకులు పొందడంతో పాటు, అర్హతను బట్టి ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందేలా సంబంధిత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు డప్పు గంగమ్మ, ఎట్టయ్య ముదిరాజ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కుమార్, భోగాల శ్రీనివాస్, అనకం శ్రీనివాస్ నేత, సత్యనారాయణ, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు డిజిటల్ రేషన్ కార్డులను స్వీకరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



మునుగోడు క్రైమ్ మిర్రర్ : మునుగోడు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొని ఆస్పత్రి సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు..విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ అపర్ణ,ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు



అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు.. ఆధ్యాత్మిక శోభతో ఆలయం

గండిపేటక్రైమ్ మిర్రర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ ఉషారాణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

మణికొండలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ



గండిపేటక్రైమ్ మిర్రర్: మణికొండ డివిజన్ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను రేషన్ షాపు డీలర్, స్థానిక నాయకులు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలనే లక్ష్యంతో కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రేషన్ కార్డులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వీటి ద్వారా ప్రభుత్వం అందించే నిబంధనల ప్రకారం నిత్యావసర సరుకులు పొందడంతో పాటు, అర్హతను బట్టి పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మణికొండ డివిజన్ అధ్యక్షులు శ్రీరాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు, శివగంగ, శ్రవణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ఏడబ్ల్యూఎస్ స్టూడెంట్ బిల్డర్ కమ్యూనిటీ ప్రారంభం

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచుకోవాలి: అమెజాన్ ప్రతినిధి వంశీ రామడుగు

గండిపేటక్రైమ్ మిర్రర్: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, వినూత్న ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచుకోవాలని అమెజాన్ ప్రతినిధి వంశీ రామడుగు విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో ఏడబ్ల్యూఎస్ స్టూడెంట్ బిల్డర్ కమ్యూనిటీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ), నాయకత్వ లక్షణాలు, భవిష్యత్తు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న సాంకేతిక అంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకోవాలని వంశీ రామడుగు సూచించారు. సమిష్టిగా నేర్చుకోవడం, కొత్త ప్రయోగాలు చేయడం, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు రూపొందించడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. అమెజాన్ విజయ ప్రస్థానాన్ని వివరిస్తూ, కస్టమర్ల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, తక్షణ నిర్ణయాలు తీసుకోవడం వంటి నాయకత్వ సూత్రాలను వివరించారు. తీసుకున్న నిర్ణయాలను మార్చడం కష్టమైన సందర్భాల్లో జాగ్రత్తగా ఆలోచించాలని, మార్చుకునే అవకాశం ఉన్న నిర్ణయాల్లో ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో ఉపయోగించే అమెజాన్ ఈసీ2, అమెజాన్ ఎస్3, ఏడబ్ల్యూఎస్ లాంబ్డా, డైనమోడీబీ, అమెజాన్ బెడ్‌రాక్, అమెజాన్ క్యూ వంటి సాంకేతిక సేవలను విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రాంప్ట్ ఇంజినీరింగ్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌పై అవగాహన పెంచుకోవడంతో పాటు ఏఐ ఆధారిత ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు నైపుణ్యాల అభివృద్ధి కోసం ఆరు



నెలల కార్యాచరణ ప్రణాళికను ఫౌండేషన్, బిల్డ్, లాంచ్ అనే మూడు దశల్లో వివరించారు. సాంకేతిక పునాదులను బలోపేతం చేసుకోవడం, ప్రాజెక్టులను రూపొందించడం, ప్రొఫెషనల్ పోర్ట్‌ఫోలియోలను అభివృద్ధి చేయడం, హ్యాకథాన్‌లలో పాల్గొనడం ద్వారా ఉద్యోగావకాశాలకు సిద్ధం కావాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, బృంద స్ఫూర్తి, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏడబ్ల్యూఎస్ నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, సంబంధిత సర్టిఫికేషన్లు పొందడం ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.వి. రజినీ కాంత్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఏడబ్ల్యూఎస్ సాంకేతిక పరిజ్ఞానం, సర్టిఫికేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ ఆధారిత ఆటోమేషన్ భవిష్యత్తులో ఉద్యోగ రంగంపై చూపే ప్రభావం, వ్యాపార కార్యకలాపాల్లో దాని వినియోగం వంటి అంశాలపైనా కార్యక్రమంలో చర్చించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమను తాము అభివృద్ధి చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల నిర్వహణ బృందం పాల్గొన్నారు. ఏడబ్ల్యూఎస్ స్టూడెంట్ బిల్డర్ కమ్యూనిటీ ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరగడంతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సాధించేందుకు అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 | గురువారం | 15-10-2026

అహింసతోనే నిజమైన భక్తి..

మూగజీవాల రక్షణకు పిలుపు!! ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ అవగాహన కార్యక్రమం



క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ సిటీ బ్యూరో : భారతీయ నాగరిక వ్యవస్థలో అహింస, నిరుపాధిక ప్రేమ, జంతు సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ ప్రత్యేక శ్రీకారం చుట్టింది. జీవ హింస చేయరాదు అనే నినాదంతో అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ బుధవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత శక్తి, ధైర్యం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొంటూ, నిజమైన భక్తి అంటే అహంకారం, కోపం, ద్వేషాన్ని విడిచిపెట్టి ప్రతి ప్రాణిపై ప్రేమ, కరుణ చూపడమేనని నిర్వాహకులు సందేశమిచ్చారు.“దైవానికి అహంకారాన్ని సమర్పించండి.. జీవుల ప్రాణాలను కాదు! అనే నినాదంతో జంతువుల పట్ల దయ చూపాలని, ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని పిలుపునిచ్చారు. జంతుబలికి బదులుగా పండ్లు, పూలు, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు వంటి అహింసాయుత సమర్పణలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమం ఏ మతాన్నీ, సంప్రదాయాన్నీ విమర్శించడానికి కాదని, అన్ని సంప్రదాయాలను గౌరవిస్తూ కరుణతో కూడిన సమాజ నిర్మాణమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పిఎస్ఎస్ఎం మూవ్‌మెంట్ ట్రస్టీ కూకట్‌పల్లి లక్ష్మి, అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పుల్లూరి సంతోష్ కుమార్, చిలకయ్యతో పాటు వారి బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రత్యేక అవగాహన కల్పించడం కోసం, కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించడంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో పనసకాయ బిర్యానీతో పాటు మొక్కల ఆధారిత పోషకాహారాన్ని అందించారు. అహింస, కరుణ, జీవరక్షణను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని, విద్యార్థులు, యువత, కుటుంబాలు, ఆధ్యాత్మిక సంస్థలు ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. అహింసా పరమో ధర్మః ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచారం ద్వారా ప్రతి జీవిపై ప్రేమ, దయ, బాధ్యతతో వ్యవహరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



సేవలందించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

పిఐసి సమావేశంలో 54 ఎజెండా అంశాలకు ఆమోదం

రుణాల మంజూరు, వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి

రికవరీ శాతం తక్కువగా ఉన్న 5 బ్యాంకు శాఖలకు నోటీసులు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: సహకార బ్యాంకుల ద్వారా రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయడంతో పాటు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బుధవారం సంగారెడ్డిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన పీఐసీ, జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమావేశాలు నిర్వహించారు. పిఐసి సమావేశంలో 54 ఎజెండా అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం జరిగిన సమీక్షలో బ్యాంకు కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, రుణాల మంజూరు, వసూళ్లు, డిపాజిట్ల సేకరణ, నిర్దేశిత లక్ష్యాల సాధనపై కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు. మంజూరు చేసిన రుణాల వసూళ్లను వేగవంతం చేసి, నిరర్థక ఆస్తులు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిపాజిట్ల పెంపునకు కార్యాచరణ రూపొందించాలని, బ్యాంకింగ్ సేవలను పారదర్శకంగా, సులభతరంగా అందించాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, బ్యాంకు నిబంధనలను పాటిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. రుణాల వసూళ్ల శాతం తక్కువగా ఉన్న రామాయంపేట, సంగారెడ్డి లోకల్ బ్రాంచ్, ఝరాసంగం, శంకరంపేట-ఆర్, సిద్దిపేట-2 శాఖల అధికారులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకు అభివృద్ధితో పాటు రైతుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ సహకార రంగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎం. సురేష్, నాబార్డ్ డీడీఎం ఎం.వి. కృష్ణ తేజ, జనరల్ మేనేజర్లు కె. జనార్ధన్, జి. శ్రీనివాస్, డీజీఎంలు కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎం. రమేష్, ఏజీఎంలు జి. యాదగిరి, జి. శ్రీనివాస్, కె. వెంకటేశం, ఎల్. సంగమేశ్వర్, ఎ. కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు

ప్రతిరూపం బతుకమ్మ

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ఇది నిదర్శనమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మకు పూజలు నిర్వహించి, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 17వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల వారీగా వేడుకల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్ రూపొందించినట్లు వెల్లడించారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.


జిల్లేలగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సిద్ధాల శ్రీనివాస్ నియామకం

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా : సిద్ధాల శ్రీనివాస్



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లేలగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సిద్ధాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సిద్ధాల శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లేలగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు, అలాగే బడంగ్పేట్ సర్కిల్ లోని వివిధ డివిజన్ల అధ్యక్షులు, డివిజన్ల బీజేపీ నాయకులకు, జిల్లా నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, బీజేపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, జిల్లేలగూడ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువవుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, అర్హతల పరిశీలనపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): బడంగ్‌పేట్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు, దరఖాస్తుల పరిశీలన, అర్హతల ధ్రువీకరణపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరేష్ పాల్గొని పోలింగ్ స్టేషన్ల సంఖ్యల వివరాలు, ఫారం-18 దరఖాస్తుల పరిశీలన, విద్యార్హత ధ్రువపత్రాల ధ్రువీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు దరఖాస్తుదారులు 31.10.2023 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండటంతో పాటు, సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉండాలి. నివాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 06.11.2026. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ceotelangana.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాలాపూర్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మరియు సరూర్‌నగర్ సర్కిళ్లకు చెందిన ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి.

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)



ఆసరా ఫౌండేషన్ బిఎస్ఎస్ఆర్ ట్రోఫీ సీజన్-1

మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ వేడుకలో పాల్గొన్న

సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ కంఠమహేశ్వర దేవాలయం దగ్గర ఆసరా ఫౌండేషన్ బిఎస్ఎస్ఆర్ ట్రోఫీ సీజన్-1 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ వేడుకలో టోర్నమెంట్ స్పాన్సర్ ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివ శంకర్ తో కలిసి ప్రారంభ కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఎస్ఐ సీతా పాండు, సింగర్ సుక్కరాం నరసయ్య. అనంతరం ఈ సీజన్ లో మొదటి మ్యాచ్ టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సురపల్లి వెంకటేష్, బల్గూరి శివ సాగర్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కార్యదర్శి కొండ నవీన్ గౌడ్,సింగం కృష్ణ. బిఎస్ఎస్ఆర్ సీజన్ - 1 ఆర్గనైజర్లు చెరుకుపల్లి భాస్కర్, ఎండి ఆరిఫ్, సుక్కగిరి బాబు, కోర్ర సాయిరాం, జనగాం సంజీవ, చెరుకుపల్లి శివ, శ్రీకాంత్, వడ్డేపల్లి పవన్, మండల క్రీడా అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి లో "ఫన్ ఫెయిర్ ఎక్స్పో" ఎగ్జిబిషన్ ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన

కోటంరెడ్డి వినయ్ రెడ్డి




కూకట్ పల్లి, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్): కూకట్ పల్లి లోని నెక్సస్ మాల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫన్ ఫెయిర్ ఎక్స్పో' ఎగ్జిబిషన్ మంగళవారం కోటంరెడ్డి వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఎగ్జిబిషన్ చాలా ఆహ్లాదకరంగా ఉందని రానున్న రోజులలో రాజారెడ్డి ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో రకాల ఎగ్జిబిషన్ ను కూకట్ పల్లి వాసులు చూడబోతున్నారన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ భారత దేశంలోనే కాకుండా సౌత్ ఏషియన్ లో అత్తిపెద్ద 360 డోమ్ ను ఈ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేశామని ఈ షోను ఒక్కసారి 600 మంది తిలకించవచ్చన్నారు. అలాగే బటర్ఫ్లై షో, డైనోసార్ పార్క్ ను కూడా ఏర్పాటు చేశామని ఈ దసరా దీపావళి సెలవుల సందర్భంగా చిన్న పిల్లలకు ఎంతో సరదాగా గడిపేందుకు ఈ ఎగ్జిబిషన్ బాగుంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు 60 రోజుల పాటు ఈ షోలు కొనసాగుతాయన్నారు. ఎగ్జిబిషన్ ను తిలకించేందుకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా టికెట్ ఖరీదు 150 రూపాయలు నిర్ణయించమన్నారు. అలాగే ఇక్కడ రెండు వందల స్టాల్స్ ఏర్పాటు చేశామని. ఎగ్జిబిషన్ ను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ వాష్ రూమ్ లు. డ్రింకింగ్ వాటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ మీద ఆధారపడి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ 600 మంది జీవనోపాధి కొనసాగిస్తున్నారని తెలుపుతూ ప్రతి ఒక్కరు మమ్మల్ని ఆదరించవలసిందిగా రాజారెడ్డి కోరారు.

కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిపై 'మిస్ అండ్ మిసెస్' మహిళల వస్త్ర ప్రదర్శనశాల ప్రారంభం

నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించి వినియోగదారుల ఆదరణ పొందాలి

రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి





కూకట్ పల్లి, అక్టోబర్ 14 క్రైమ్ మిర్రర్): కేపీహెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన 'మిస్ అండ్ మిసెస్' మహిళల వస్త్ర ప్రదర్శనశాలను రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రదర్శనశాల యజమానులు అభిలాష్ రెడ్డి, జయంత్ కుమార్, వివి రెడ్డిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలకు నచ్చే వస్త్రాలను నాణ్యతతో పాటు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలని పురేందర్ రెడ్డి సూచించారు. వినియోగదారులకు ఆకర్షణీయమైన ధరలు, నాణ్యమైన వస్త్రాలు అందించడం ద్వారా వారి నమ్మకాన్ని, ఆదరణను పొందవచ్చని తెలిపారు. వ్యాపారంలో వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని యజమానులకు సూచించారు. నూతనంగా ప్రారంభించిన వస్త్ర ప్రదర్శనశాల మరింత అభివృద్ధి సాధించి, వినియోగదారుల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తూ యజమానులను ఆశీర్వదించి అభినందించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. నర్సింగరావు, శ్రీధర్, జి. ప్రసాద్, గణేష్, మురళి తదితరులు పాల్గొని వస్త్ర ప్రదర్శనశాల యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

దుర్గామాత ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి

మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



కేశంపేట,(క్రైమ్ మిర్రర్): దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు. పాపిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ శశిరేఖయాదయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దుర్గామాత కుంకుమార్చన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతి, ఐకమత్యం వెల్లివిరియాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక భక్తులు, మహిళలు, యువత తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు నిర్వహించారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి..

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు.. తహసీల్దార్ రాజేందర్ రెడ్డి



కేశంపేట,(క్రైమ్ మిర్రర్): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజేందర్ రెడ్డి ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నిర్వహించే ఈ శిబిరాల్లో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు పొందనున్న యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఫారం-6 సమర్పించాలని సూచించారు. ఈ నెల 15, 16 తేదీల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అందుబాటులో ఉండి ఓటరు నమోదు ప్రక్రియకు సహకరిస్తారని తెలిపారు. అర్హులైన పౌరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు



నూతనకల్ (క్రైమ్ మిర్రర్): ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని,అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని బక్క హేమ్లాతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణ నాయక్ అన్నారు. బుదవారం మండల పరిధిలోని బక్క హేమ్లాతండా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేనావత్ సురేందర్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు కేతావత్ మంగత్య నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సురేందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సత్యవతి కాంగ్రెస్ నాయకులు మూడ్ చంపు నాయక్,పాతులోతు రవి నాయక్, పాతులోతు సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయాల ను ప్రతిబింబించేలా బతుకమ్మలను అందంగా పేర్చి, పండుగ ఉత్సాహాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకు నే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం మనందరి బాధ్యత అని అన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు జరుపుకునే ఈ వేడుక తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైనదని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భావితరాలకు మన పండుగల ప్రాముఖ్యతను తెలియజేయాలని ఆమె సూచించారు. మహిళల భాగస్వామ్యంతో పండుగలను నిర్వహించడం ద్వారా సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాయి.

ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:- దసరా దీపావళి సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం లో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభానికి ముఖ్య అతిథులుగా ఆసరా ఫౌండేషన్ చైర్మన్,మాజీ జెడ్పిటీసి బొల్ల శివశంకర్ ,గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి లింగస్వామి, తెలుగు ప్రపంచ సెలబ్రేటి రెడ్ స్టార్ సుక్క రాంనర్సన్న , స్థానిక ఎస్ఐ సీత పాండు హాజరయ్యారు. ఈ టోర్నమెంట్లో మండల పరిధిలో ఉన్న 30 టీములు పోటీ పడనున్నాయి ఇట్టి కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజేర్స్, చెర్కుపల్లి భాస్కర్, యండి ఆరీఫ్ కాన్,సుక్క గిరిబాబు, కొర్ర సాయిరాం, జనగాం సంజీవ,చెరుకుపల్లి శివ,సిరిమువ్వల శ్రీకాంత్, వడ్డేపల్లి పవన్, టోర్నమెంట్ కు వచ్చిన టీంలు, తదితరులు పాల్గొన్నారు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ముచ్చర్ల జనార్దన్ రెడ్డి


రాయపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం..

ఊరుకొండలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి (ఎంజేఆర్) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్ల, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజపూర్ మండలం రాయపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామంలో నిర్వహించిన శ్రీ మహాగణపతి, హనుమాన్, నవగ్రహ, నాగదేవత, శివ నందీశ్వర, దుర్గాదేవి అమ్మవార్లకు పంచలోహ కవచ సమర్పణతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండల కేంద్రంలో సింహవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

పరిగి సివిల్ కోర్ట్ మాజీ ఏజిపి బి వెంకట రెడ్డి మాతృమూర్తికి నివాళులర్పించిన నాయకులు



క్రైమ్ మిర్ర కుల్కచర్ల: పరిగి సివిల్ కోర్ట్ మాజీ ఎజీపి బి వెంకట రెడ్డి మాతృమూర్తి సుశీలమ్మ దశదినకర్మ బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముకులు కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ కుల్కచర్ల మండలం అధ్యక్షులు సేరి రాంరెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు ముకుందం, కృష్ణారెడ్డి, ఆనంద్ గౌడ్, పాల్గొని సుశీలమ్మకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బచ్చిరెడ్డి, పరమటి అంజిలయ్య, బులుసుని బాల్రెడ్డి, జనార్దన్ రెడ్డి, జలీల్ భాయ్, హరినాథ్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, గండి లక్ష్మయ్య, కటికే రాంజీ, ఉపాధ్యాయులు కొత్త అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం - రాగి వైరు దొంగతనం..!



జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్): పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి, దానిలోని సుమారు 25 కిలోల రాగి వైరును ఎత్తుకెళ్లారు. విద్యుత్ శాఖ అధికారి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్.ఐ కుమారస్వామి వెల్లడించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 గురువారం 15-10-2026

నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు
సత్వర న్యాయం అందించాలి





పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ

రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

పోలీసు అధికారులకు ఎస్పీ పరితోష్ పంకజ్ దిశానిర్దేశం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, అక్టోబర్ 14: ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసుల ఛేదనతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. దర్యాప్తులో సాంకేతిక, న్యాయపరమైన సందేహాలు తలెత్తినప్పుడు ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నిజమైన దోషులకు శిక్ష పడినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి హాట్‌స్పాట్లుగా ప్రకటించాలని, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, జాతీయ రహదారులను కలిపే మార్గాల్లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల సమీప గ్రామాల్లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన షీ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. మహిళలపై వేధింపులను అరికట్టడంతో పాటు మహిళలకు సంబంధించిన చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గ్రామాల్లో రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నేరాల దర్యాప్తులో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, ప్రతి గ్రామంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు వంటి కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పోలీసు స్టేషన్లకు కేటాయించిన వాహనాల స్థితిగతులను ఎస్పీ పరిశీలించారు. వాహనాలకు క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి, అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు సిద్ధంగా ఉంచాలని డ్రైవర్లను ఆదేశించారు. అవసరమైన అత్యవసర పరికరాలు వాహనాల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వాహనాలను పరిశుభ్రంగా ఉంచిన డ్రైవర్లను అభినందించి రివార్డులు ప్రకటించారు.

ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు

విధి నిర్వహణలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి కూడా రివార్డులు అందించేందుకు సిఫారసు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, జిల్లా ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, సబ్‌ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ మండల కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నూతనకల్ (క్రైమ్ మిర్రర్): నూతనకల్ గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్టమల్లారెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ను కోరారు. బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి గ్రామానికి కావలసిన సౌకర్యాలపై కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కు వివరించారు. సూర్యాపేట దంతాలపల్లి ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించటం, నూతనకల్‌లో బస్టాండ్ నిర్మించి, ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.గ్రామ అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేసి, గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండపల్లి చందు, మహేష్, సతీష్ సైదులు జలంధర్ కళ్యాణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్



కూకట్ పల్లి, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ డివిజన్ పరిధిలో దేవి నవరాత్రుల సందర్భంగా పంచమి కాలనీలోని అమ్మవారి నవరాత్రుల సందర్భంగా శ్రీ మరెమ్మ దేవాలయంలో నెలకొల్పిన దుర్గ మాత పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ దేవి నవరాత్రులలో ప్రతి రోజు ఒక్కో అవతారంలో అమ్మవారిని పూజించడం జరుగుతుందని అంతేగాక తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బతుకమ్మ తీరొక్క పూలతో అమ్మవారి స్వరూపానికి ప్రతీకగా కొలుస్తారు. అలాంటి పండుగ ఈ నవరాత్రులతో ముడిపడి ఉండడం మరో విశేషం. అమ్మవారిని కొలిచిన ప్రతిక్కరికి సుఖ సంతోషాలు, అష్టఐశ్వర్యాలు ఇస్తుందని ప్రగాఢ నమ్మకంతో అడబిడ్డలు అందరూ బతుకమ్మ దేవి నవరాత్రులలో ఆటపాటలతో ఉత్సహంగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలలో ప్రైవేటు ఆసుపత్రులను పరిశీలించిన ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు



మంచిర్యాల అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) ద్వారా అందుతున్న వైద్య సేవలను జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ అధ్యక్షుడు గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుతున్న ఉచిత వైద్య సేవలపై జేఏసీ నాయకులు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని వసుధ ఆసుపత్రి, వైష్ణవి డెంటల్ ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లతో కలిసి జేఏసీ బృందం సందర్శించింది. ఆయా ఆసుపత్రుల్లో అందుతున్న చికిత్సలను, సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం 16 ప్రైవేటు ఆసుపత్రులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ పరిధిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. హెల్త్‌కార్డులు ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆసుపత్రి యాజమాన్యాలను కోరారు.సందర్శనలో భాగంగా వసుధ ఆసుపత్రి మేనేజ్‌మెంట్ ప్రతినిధి నరసింహులు, వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైష్ణవి డెంటల్ ఆసుపత్రిలో వైద్యులు డాక్టర్ పేర్ల నాగార్జున, డాక్టర్ వైష్ణవిలతో మాట్లాడి దంత వైద్య సేవలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పున్నం మల్లయ్య, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లు సత్యనారాయణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల నిర్వహణ



క్రైం మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాల నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కన్వీనర్ శ్రీ విజయభాస్కర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ ఘనపూర్ వెంకటయ్య, ఎమ్మెల్సీ ఎన్నికల కో-కన్వీనర్ శ్రీ రాచ శ్రీనివాస్ రెడ్డి రామచంద్రయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రుల ఓటర్లను చైతన్యపరచి ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు శ్రీ జానకిరామ్, గ్రామ సర్పంచ్ వార్వాల అంజిలయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి సౌమ్య రెడ్డి,సార్ కన్వీనర్ కేశవలు, ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్లు శ్రీ హరికృష్ణ, బందెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీ గాదె మహిపాల్, సూర్యకాంతం, ఉప సర్పంచ్ శ్రీ విజయ్ కుమార్, నిరటి కర్ణయ్య,జిల్లా నాయకులు శ్రీ మోనా చారి, శ్రీ గడుసు మైపాల్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నరేష్, బాలకృష్ణారెడ్డి, సుంకు మల్లేశం, మండల ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, కొండ ఆంజనేయులు, ఇప్పాయిపల్లి గాదె.మల్లేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆంజనేయులు, కేంద్రం ఇంచార్జ్ బాయికాడ వెంకటేష్ రామకృష్ణ, రవీందర్ రెడ్డి, కాటన్ పల్లి ప్రవీణ్ రాజేందర్,లాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

ఓటు చోరీ అంటే ప్రజాస్వామ్యంపై దాడి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్. రమేష్ గుప్తా



కూకట్ పల్లి, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్): కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. రమేష్ గుప్తా డిమాండ్ చేశారు. ఓటు చోరీ అనేది ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి అని ఆయన పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని రమేష్ గుప్తా అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉండాలని, ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని పేర్కొంటూ, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రమేష్ గుప్తా పిలుపునిచ్చారు.ఓటు హక్కును కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటమేనని ఎస్. రమేష్ గుప్తా స్పష్టం చేశారు.

ఉప్పు నాగయ్యకు ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్ టీచర్స్ అవార్డు

నూతనకల్ (క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని అలుగునూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్యకు ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ కన్ క్లేవ్ టీచర్స్ అవార్డ్ -- 2026 లభించింది. హైదరాబాద్‌లో జీ న్యూస్ తెలుగు ఆధ్వర్యంలో తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా నిర్వహించిన గురువందనం -- 2026 కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా నాగయ్య అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రముఖ రాజకీయ నాయకులు కే. కేశవరావు, ఈటల రాజేందర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు పునాదులు తరగతి గది నుంచే పడతాయని పేర్కొన్నారు. సమర్థవంతమైన బోధనతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించుకోవడం గర్వకారణమన్నారు. ఉప్పు నాగయ్య తాను పనిచేసిన వివిధ పాఠశాలల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి సూర్యాపేట జిల్లా నుంచి ఒక్క నాగయ్యకే ఈ అవార్డు లభించడం విశేషమని పేర్కొన్నారు.



అవార్డు రావడం పట్ల కృతజ్ఞతలు: తన విద్యా సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు, తనకు సహకరించిన సహచర ఉపాధ్యాయులకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు ఉప్పు నాగయ్య హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రాంరెడ్డిపల్లిలో హైమాస్ట్ స్తంభాల ఏర్పాటు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధులతో ఏర్పాటు

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): గ్రామ అభివృద్ధిలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల నుంచి మంజూరైన, హైమాస్ట్ స్తంభాలను రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహ ప్రారంభించారు. ఈ హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో గ్రామంలో రాత్రివేళల్లో, మెరుగైన వెలుతురు అందడంతో పాటు, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కలగనుంది. గ్రామఅభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసిన, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, సర్పంచ్ లపంగి నర్సింహా గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు సైదులు, వార్డు సభ్యులు పగిల్ల యాదమ్మ, పగిల్ల శంకర్, భీమనగోని మల్లమ్మ, భీమనగోని యాదయ్య, పగిల్ల దవాలమ్మ, పగిల్ల వంశీ, లపంగి మహేందర్, హైమా, భాస్కర్, నిరంజన్, గ్రామ శాఖ అధ్యక్షుడు కారింగు నర్సింహా, పాముల కడారి ఎర్రయ్య, సిరిపంగి శీను, పొగాకు జంగయ్య, పోలగోని యాదయ్య, పీర్ల అసిస్టెంట్ సలీమోజు యాదయ్య, పాముల నర్సింహాతదితరులు పాల్గొన్నారు.



పాదరసం కాలుష్యంపై అంతర్జాతీయ సదస్సుకు

భారత్ తొలిసారి ఆతిథ్యం

ఐఐటీ హైదరాబాద్‌లో 26 దేశాల నిపుణుల సమాగమం

పాదరసం కాలుష్యం నివారణ, ప్రజారోగ్య పరిరక్షణపై విస్తృత చర్చలు







సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: పాదరసం కాలుష్యంపై ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ శాస్త్రీయ సదస్సుకు భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చింది. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో అక్టోబర్ 4 నుంచి 9 వరకు ఆరు రోజుల పాటు జరిగిన 17వ అంతర్జాతీయ పాదరసం కాలుష్య సదస్సు (ఐసీఎంజీపీ--2026) విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 26 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు పాల్గొని పాదరసం కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య సమస్యలపై విస్తృతంగా చర్చించారు. 36 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సదస్సు తొలిసారిగా భారతదేశంలో నిర్వహించడం విశేషం. ఐఐటీ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఆఫ్ క్లైమేట్, ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టెయినబిలిటీ సమన్వయం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఆసిఫ్ ఖురేషీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్‌కు చెందిన డాక్టర్ జగన్నాథ్ బిస్వకర్మ సంయుక్తంగా సదస్సుకు అధ్యక్షత వహించారు. వాతావరణంలో పాదరసం ఉద్గారాలు, నేల, నీరు, జీవవైవిధ్యంపై వాటి ప్రభావం, పర్యావరణ పర్యవేక్షణ, మానవ ఆరోగ్యానికి ఎదురయ్యే ముప్పులు, కాలుష్య నియంత్రణ చర్యలపై పలు శాస్త్రీయ సమావేశాలు నిర్వహించారు. పరిశోధనల్లో లభించిన ఆధారాలను పర్యావరణ విధానాల రూపకల్పనకు అనుసంధానించి, కాలుష్య నివారణకు ఆచరణాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని నిపుణులు నొక్కిచెప్పారు. ఈ సదస్సులో ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలిసారిగా అధికారికంగా పాల్గొనడం మరో ముఖ్యమైన విశేషం. సంస్థకు చెందిన డాక్టర్ ఎలెనా జర్డాన్ నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాదరసం మానవ ఆరోగ్యంపై చూపే ప్రభావాలు, శరీరంలో పాదరసం స్థాయుల పర్యవేక్షణ, ఆరోగ్య ప్రమాదాల నివారణ, బాధితులకు వైద్య సేవలు అందించడంలో ప్రజారోగ్య వ్యవస్థల పాత్రపై చర్చించారు.ఐక్యరాజ్యసమితి మినమాటా కన్వెన్షన్ కార్యదర్శి విభాగం ప్రతినిధులు సదస్సులో పాల్గొని అంతర్జాతీయ పర్యావరణ పాలనలో శాస్త్రీయ పరిశోధన ప్రాధాన్యతను వివరించారు. శాస్త్రీయ ఆవిష్కరణలను పర్యావరణ పరిరక్షణ చర్యలుగా మార్చడం, కాలుష్య నియంత్రణ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రభావిత సమాజాలను రక్షించడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. జపాన్‌కు చెందిన మినమాటా వ్యాధి బాధితుడు మసామి ఒగాటా తన అనుభవాలను వివరించడం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారిశ్రామిక కాలుష్యం కారణంగా పాదరసం మానవ జీవితాలపై చూపే దీర్ఘకాలిక ప్రభావాలను ఆయన వివరించారు. కాలుష్య నియంత్రణలో శాస్త్రీయ పరిశోధనతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ నియంత్రణ, బాధిత సమాజాల అనుభవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సమావేశం గుర్తుచేసింది. సదస్సు ప్రారంభోత్సవంలో పాదరసం పరిశోధన రంగంలో విశేష సేవలందించిన ప్రొఫెసర్ మే గస్టిన్‌కు జీవితకాల సాధన పురస్కారం అందజేశారు. వర్ధమాన పరిశోధకుడిగా డాక్టర్ కింగ్‌రు వుకు ఎమర్జింగ్ రీసెర్చర్ అవార్డు ప్రదానం చేశారు. అలాగే 24 మంది విద్యార్థులకు స్టూడెంట్ అవార్డులతో గుర్తింపు లభించింది. ముగింపు కార్యక్రమంలో ఉత్తమ పోస్టర్ ప్రదర్శనలు చేసిన మరో 11 మంది విద్యార్థి పరిశోధకులకు పురస్కారాలు అందజేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పాదరసం పరిశోధన, వాతావరణ కొలతలు, కాలుష్య ఉద్గారాల అంచనా, దీర్ఘకాలిక పర్యావరణ పర్యవేక్షణ వంటి అంశాలపైనా నిపుణులు చర్చించారు. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, రష్యా, చైనా, అర్జెంటీనా తదితర దేశాల పరిశోధకులు తమ పరిశోధన ఫలితాలను ప్రదర్శించారు. పాదరసం కలిగిన ఉత్పత్తుల వినియోగం, సంప్రదాయ బంగారు తవ్వకాల్లో పాదరసం వినియోగం, పర్యావరణ కాలుష్య నివారణపై ప్రత్యేకంగా చర్చించారు. ముగింపు కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన గుంజుం హైదర్ తూర్పు హిమాలయాల్లో జీవవైవిధ్య పరిరక్షణకు స్థానిక సమాజాలు చేస్తున్న కృషిని వివరించారు. అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న బుగున్ లియోసిచ్లా పక్షి జాతి పరిరక్షణ కోసం బుగున్ సమాజం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. పర్యావరణ సమస్యల పరిష్కారంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం, సంప్రదాయ పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధన పరస్పరం తోడ్పడాలని పేర్కొన్నారు.అక్టోబర్ 9న జరిగిన ముగింపు కార్యక్రమానికి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, అంతర్జాతీయ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ విభాగాలు, భారత ప్రభుత్వ పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సహకారం కూడా సదస్సుకు లభించింది. పాదరసం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అంతర్జాతీయ సహకారం, సమర్థవంతమైన పర్యావరణ విధానాలు, నిరంతర పరిశోధన, ప్రజారోగ్య పరిరక్షణ అత్యవసరమని సదస్సు స్పష్టం చేసింది. శాస్త్రీయ పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడం ద్వారా కాలుష్య ప్రభావాలను తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు. తదుపరి అంతర్జాతీయ పాదరసం కాలుష్య సదస్సు 2028లో స్పెయిన్‌లోని టోలెడోలో నిర్వహించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష ప్రామాణికం కావాలి: అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య





మంచిర్యాల అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక లావాదేవీలను వీలైనంత వరకు తెలుగులోనే నిర్వహిస్తూ, సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాల సమాచారాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో అందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య పిలుపునిచ్చారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన 'అధికార భాష అమలు' మరియు 'సమాచార హక్కు చట్టం' అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, డీఆర్వో మోతిరామ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య మాట్లాడుతూ... జన్మతః మన భావ వ్యక్తీకరణకు పునాది అయిన మాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలని, 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్న నానుడిని ఆచరణలో చూపాలని కోరారు. మన భాషను కాపాడుకోవడం, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపన ఫలకాలు, అధికారుల నామఫలకాలు, హాజరు పట్టికలు, సెలవు దరఖాస్తులు, ఇతర అధికారిక పత్రాల్లో వీలైనంత వరకు తెలుగు భాషనే వినియోగించాలని ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే క్షేత్రస్థాయి ఉద్యోగులు సుబోధకమైన రీతిలో సమాధానాలు ఇవ్వడం ద్వారా భాషాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ.. రోజువారీ విధుల్లోనూ, ఆర్టీఐ సమాధానాల్లోనూ తెలుగుకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఆర్టీఐతో పారదర్శక పాలన

సమాచార హక్కు చట్ట వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ... ఆర్టీఐ చట్టం-2005 ప్రకారం పారదర్శకత, జవాబుదారీతనంతో సేవలు అందించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారు కోరిన సమాచారం ఇతర శాఖకు సంబంధించినదైతే, వెంటనే సదరు విభాగానికి బదిలీ చేసి విషయాన్ని దరఖాస్తుదారునికి తెలపాలన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ.. ఆర్టీఐ ప్రజాస్వామ్యానికి హృదయస్పందన వంటిదని వ్యాఖ్యానించారు. దరఖాస్తు అందిన 30 రోజుల్లోగా ఖచ్చితమైన సమాచారం అందించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. అనంతరం చట్టంలోని పలు సెక్షన్లపై అవగాహన కల్పించి, అధికారులతో సమర్థవంతమైన అమలుకై ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు, రాబోయే బతుకమ్మ సంబరాల సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ప్రతినిధులతో కలిసి పండుగ గోడప్రతులను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు దేశ్‌పాండేతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 ఏళ్లుగా వైభవంగా మహంకాళి దేవీ నవరాత్రి ఉత్సవాలు

మైత్రి గ్రౌండ్‌లో అమ్మవారిని దర్శించుకున్న మాధ్రి పృథ్వీరాజ్



పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14: పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్‌లో మహంకాళి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో మాధ్రి పృథ్వీరాజ్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహంకాళి దేవాలయ సేవా సమితి సభ్యులకు దేవీ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 30 ఏళ్లుగా సంప్రదాయాలను కొనసాగిస్తూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న సేవా సమితి కృషిని పలువురు అభినందిస్తున్నారు.

వాసవి మాత రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం



వనపర్తి అక్టోబర్ 14 క్రైమ్ మిర్రర్ : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అదేవిధంగా. చిన్న చౌడేశ్వరి టెంపుల్ లో. శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి. ఆలయంలో రాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన బుధవారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్య అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు, పురుషులు, యువతీ యువకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఉత్సవాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.

మంచిర్యాలలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నలుగురు జూదరుల అరెస్ట్.. రూ.40,300 నగదు, స్కూటీ స్వాధీనం



మంచిర్యాల,14(క్రైమ్ మిర్రర్) : మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్, టౌన్ పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.40,300 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలేజ్ రోడ్డులోని హరినిలయ విల్లాస్‌లో ఓ ఇంట్లో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ లక్ష్మణ్‌రావు, మంచిర్యాల టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో మంచిర్యాల కాలేజ్ రోడ్డుకు చెందిన కత్రె గణేష్, రాంనగర్‌కు చెందిన ఆరె రాజేష్, జమ్మికుంటకు చెందిన మహమ్మద్ అన్వర్ పాషా, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పోలక మల్లేష్ పట్టుబడ్డారు. నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మంచిర్యాల టౌన్ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్



కూకట్ పల్లి, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాలాజీ నగర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగాతూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు లభించి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంతో పాటు, ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్ పుత్, వెంకట్ రావు, స్వరూప, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

8 | గురువారం | 15-10-2026

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో
పేదల కళ్లలో ఆనందం

మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రజాప్రత్వంలోని పేదల కళ్ళల్లో ఆనందం ఉంటుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని అంతారం గ్రామంలో బ్యాగరి అంజిలమ్మ చెన్నయ్య, చెక్కల సరితా శ్రీనివాస్ నూతన నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో బుధవారం స్థానిక సర్పంచ్ పృథ్వీరాజ్ నాయకులతో కలిసి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోని ఎంతోమంది పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారు పేర్కొన్నారు. గత పాలకులు ప్రజల సంక్షేమాన్ని వదిలేసి కాలయాపన చేశారని, పేదలకు డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని గొప్పలు చెప్పి ఒక ఇల్లు కూడా కట్టించలేదని వారు ఎద్దుల చేశారు. ఇప్పుడైనా ప్రజలు గమనించాలని అభివృద్ధి సంక్షేమం ఏ విధంగా జరుగుతున్నాయో గుర్తించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరిమితి అంజిలయ్య, జలీల్ భాయ్, ఉప సర్పంచ్ భీమయ్య, బోయిని సాయన్న, తలారి. బిచ్చన్న కామన్ పల్లి సర్పంచ్ వెంకటయ్య, రాంపూర్ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు రీ-సర్వేతో పరిష్కారం: అదనపు కలెక్టర్ వి.రాములు



మంచిర్యాల అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్) : భూముల హద్దులు, విస్తీర్ణంపై ఉన్న సమస్యలను రీ-సర్వేతో పరిష్కరించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. బుధవారం హాజీపూర్ మండలం చందనాపూర్, లక్షెట్టిపేట మండలం లింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూముల పునఃసర్వేను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆధునిక పరికరాలతో భూములను కొలిచి, వాస్తవ విస్తీర్ణం, హద్దులను గుర్తిస్తామన్నారు. పాత భూ రికార్డుల్లోని తప్పులను సరిచేసి, భూములకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.సర్వే తేదీని ముందుగానే భూయజమానులకు తెలియజేస్తామని తెలిపారు. నోటీసుల్లో పేర్కొన్న తేదీన భూయజమానులు తమ పొలాల వద్ద ఉండి, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించాలని సూచించారు. రికార్డుల్లో ఉన్న భూమి విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని చెప్పారు. రీ-సర్వే ద్వారా భూ హద్దుల వివాదాలు తగ్గుతాయని, యాజమాన్య వివరాలు స్పష్టంగా నమోదవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో సంబంధిత తహసీల్దార్లు, భూ సర్వే విభాగం అధికారులు, ఇతర సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదల కళ్లలో ఆనందం

మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రజాప్రత్వంలోని పేదల కళ్ళల్లో ఆనందం ఉంటుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని అంతారం గ్రామంలో బ్యాగరి అంజిలమ్మ చెన్నయ్య, చెక్కల సరితా శ్రీనివాస్ నూతన నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో బుధవారం స్థానిక సర్పంచ్ పృథ్వీరాజ్ నాయకులతో కలిసి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోని ఎంతోమంది పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారు పేర్కొన్నారు. గత పాలకులు ప్రజల సంక్షేమాన్ని వదిలేసి కాలయాపన చేశారని, పేదలకు డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని గొప్పలు చెప్పి ఒక ఇల్లు కూడా కట్టించలేదని వారు ఎద్దుల చేశారు. ఇప్పుడైనా ప్రజలు గమనించాలని అభివృద్ధి సంక్షేమం ఏ విధంగా జరుగుతున్నాయో గుర్తించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరిమితి అంజిలయ్య, జలీల్ భాయ్, ఉప సర్పంచ్ భీమయ్య, బోయిని సాయన్న, తలారి. బిచ్చన్న కామన్ పల్లి సర్పంచ్ వెంకటయ్య, రాంపూర్ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేసిన మహిళా అధికారులు, సిబ్బంది





హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు, సిబ్బంది సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ నేపథ్యంలో హెచ్ఎండీఏ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా అధికారులు, సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ (జనరల్), కార్యదర్శి (ఎఫ్ఏసీ) శ్రీవత్స కోట ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. వేడుకల్లో పాల్గొన్న మహిళా అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా ఉద్యోగుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భావితరాలకు వాటి విశిష్టతను చాటిచెప్పడంలో బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ యాదవ్‌కు ఘన సత్కారం

ఆర్కే పురం కార్యాలయాన్ని తొలిసారి సందర్శించిన శ్రీధర్ యాదవ్

శాలువాతో సత్కరించి అభినందించిన ధీరజ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా బైతి శ్రీధర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆర్కే పురంలోని కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ధీరజ్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ భేటీలో ఇరువురూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఓబీసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినబైతి శ్రీధర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



అర్హులైన పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి : కుల్కచర్ల తాసిల్దార్ పురుషోత్తం




క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలోని అర్హులైన పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలని కుల్కచర్ల తాసిల్దార్ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1 2023 నాటికి డిగ్రీ పూర్తై మూడు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు అర్హులేనని ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ ద్వారా ఫారం 18 నింపి దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. పట్టభద్రుల ఓటర్ జాబితాలో తమ పేరు నమోదు చేసుకుంటే భవిష్యత్తులో జరిగే పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అని, పట్టభద్రులకుమాసి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత ఉన్నప్పటికీ చాలామంది పట్టబద్రులు ఇప్పటివరకు తమ పేర్లను జాబితాలో నమోదు చేసుకోకపోవడం వల్ల ఓటు వినియోగించుకొని అవకాశాన్ని కోల్పోతున్నారని అందుకే 2026 నవంబర్ 6 చివరి తేదీ వరకు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సంతానలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు..

పుత్రకామేష్టి యాగం నిర్వహణ

గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ (సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం) ప్రాంగణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు సంతానలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సంతాన సౌభాగ్యాలను, కుటుంబ శ్రేయస్సును ప్రసాదించే సంతానలక్ష్మీ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రాల నడుమ అర్చనలు సమర్పించారు. భక్తులు





భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పుత్రకామేష్టి యాగం...

నాలుగో రోజు ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పుత్రకామేష్టి యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు, ఋత్విక్కుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ యాగంతో యాగశాల ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. లోకకల్యాణం, సకల జనుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక హోమ క్రతువులు నిర్వహించారు. అమ్మవారి దివ్య అలంకరణ, విశేష పూజలు, యాగ క్రతువులతో ముచ్చింతల్ క్షేత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం

వట్టినాగులపల్లి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

నిధులు మంజూరైన పనులను పూర్తి చేయాలి

బీఆర్ఎస్ నాయకుడు పెద్దపులి కిషన్


గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ఆ పార్టీ నాయకుడు పెద్దపులి కిషన్ అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం పట్టుదలతో కృషి చేస్తున్నామని తెలిపారు. వట్టినాగులపల్లి రోడ్డు సమస్యపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ప్రయత్నాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో పెద్దపులి కిషన్ మాట్లాడుతూ.. వట్టినాగులపల్లి రోడ్డు సమస్య ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రహదారి సరిగా లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ పార్టీ తరపున పలుమార్లు అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో జూలై 20న ఖానాపూర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో సీఎంసీ కమిషనర్ సృజనతో నిర్వహించిన సమావేశంలో వట్టినాగులపల్లి రోడ్డు సమస్యను ప్రధానంగా ప్రస్తావించినట్లు కిషన్ వెల్లడించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దపులి కిషన్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, శ్రీకాంత్‌రెడ్డి, పరవింద రాజు, విష్ణువర్ధన్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని సమస్య తీవ్రతను అధికారులకు వివరించారని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరైనప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో చేపట్టేందుకు మరిన్ని నిధులు అవసరమని అప్పట్లో అధికారులు తెలిపారని ఆయన పేర్కొన్నారు. రోడ్డు పనులకు మొదట రూ.17 కోట్లు మంజూరైనట్లు, అనంతరం మొత్తం రూ.37 కోట్ల నిధులు మంజూరైనట్లు కిషన్ వివరించారు. నిధులు మంజూరైన నేపథ్యంలో ఇకపై జాప్యం చేయకుండా పనులను ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకులు డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డిని రెండుసార్లు కలిసి వినతులు అందజేసి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక కాలనీల ప్రజలకు మెరుగైన




రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, వాహనదారుల ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని పెద్దపులి కిషన్ అన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని కోరారు. ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం బీఆర్ఎస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. వట్టినాగులపల్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యే దిశగా ముందడుగు పడటం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల పట్టుదలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయితే, పనులు ప్రారంభించడంతోనే సమస్య పరిష్కారమైనట్లు కాదని, నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత అధికారులు పనుల పురోగతిని పర్యవేక్షించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి ఉంటుందని, అవసరమైతే మరింత గట్టిగా పోరాడేందుకు సిద్ధంగా ఉంటుందని పెద్దపులి కిషన్ స్పష్టం చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.

అన్నపూర్ణాదేవిగా కట్టమైసమ్మ.... దర్శనానికి పోటెత్తుతున్న భక్తజనం..!





బుద్వేల్ టీచర్స్ కాలనీలో భక్తి సందడి

ప్రత్యేక పూజలు,మహా అన్నప్రసాదంతో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): అమ్మవారి నామస్మరణతో మార్మోగుతున్న ఆలయం. భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ప్రాంగణం.రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి పారవశ్యంతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు...

ఆలయ ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలోఅమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గండిపేట మండలం టియుడబ్ల్యూ (ఐజెయు) కార్యనిర్వహక కార్యదర్శి,ఏడబ్ల్యూఏ కమిటీ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ రిపోర్టర్,పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు, శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యా నవన వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య విజయలక్ష్మి దంపతులు,పందుల విజయలక్ష్మి కుటుంబ సభ్యులు,పాల్గొని అమ్మవారిని పూజించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రగడమ్‌పల్లి శ్రవణ్ కుమార్, టీచర్స్ కాలనీ అధ్యక్షుడు నందిగామ నరసింహ, శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయి మాలిక్,బాలు,టిచర్ సురేష్,రాజేందర్ ,కుమార్, రాజేందర్ పాండే,సాయి కుమార్,ఓగిరాల హరికృష్ణ, శివ,భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు మహా అన్నప్రసాదం...

ప్రత్యేక పూజల అనంతరం పోతురాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులకు అమ్మవారి దర్శనంతో పాటు అన్నప్రసాదం అందించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతుండటం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు కోరని శ్యామ్,కోరని నరేందర్ తెలిపారు. రానున్న రోజుల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



రామకృష్ణాపూర్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

సోనీ జ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో వేడుకలు..

30 మంది మహిళలకు బహుమతులు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్): మహిళల ఆటపాటలు, రంగురంగుల పూల బతుకమ్మలతో రామకృష్ణాపూర్ పట్టణంలో పండుగ శోభ సంతరించుకుంది. సోనీ జ్యువెల్లర్స్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోదండ రామాలయ ప్రాంగణంలో మంగళవారం ‘మన ఊరు--మన బతుకమ్మ’ పేరుతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా మహిళలు పాల్గొని, పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు.బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతితో మమేకమయ్యే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందన్నారు. మహిళల భాగస్వామ్యంతో సాగిన వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి.

లక్కీడ్రాలో 30 మందికి బహుమతులు

వేడుకల్లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో ఎంపికైన 30 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సోనీ జ్యువెల్లర్స్ అధినేత హరికిషన్, సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, వర్క్‌షాప్ డీజీఎం నరేష్‌లకు రామాలయం కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సోనీ జ్యువెల్లర్స్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వి.ఆర్.4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డికి ఆహ్వానం

గండిపేట(క్రైమ్ మిర్రర్): వి.ఆర్.4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శనివారం నిర్వహించనున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరుకావాలని తెలంగాణ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని ట్రస్ట్ ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు మున్సిపల్ అధికారులు మౌఖికంగా అంగీకారం తెలిపినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ట్రస్ట్ సలహాదారుడు దిలీప్ కక్కడ్, మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, కోశాధికారి హరి హారనాథ్ రెడ్డి, సభ్యురాలు నూకల మంజుల తదితరులు నాయకులను కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కార్యక్రమానికి వచ్చే భక్తులకు మొదటి ప్రాధాన్యతగా ఉచిత పూజా సామగ్రిని అందజేస్తామని తెలిపారు. సామూహిక వినాయక పూజ, అమ్మవారి కుంకుమార్చన, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకుల పూజ, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ప్రజల కోసం ఆటపాటలతో కూడిన దాండియా, ఇంద్రజాల ప్రదర్శనలు, స్నేహపూర్వకంగా నిర్వహించే అలయ్-బలయ్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు, సంఘ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. అక్టోబర్ 24న నిర్వహించనున్న ఈ శుభకర కార్యక్రమాలకు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు.

కాటేదాన్ డివిజన్‌లో వైభవంగా దుర్గామాత శరన్నవరాత్రి వేడుకలు: భక్తులకు అన్నదానం నిర్వహించిన డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం, కాటేదాన్ డివిజన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత మండపాల వద్ద భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి అన్నదానంలో స్వయంగా వడ్డించి పాల్గొన్నారు. శరన్నవరాత్రుల వేళ మండపాలన్నీ విద్యుత్ కాంతులతో, భక్తుల నామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ.. జగన్మాత దుర్గాదేవి చల్లని చూపు కాటేదాన్ ప్రజలపై ఎప్పుడూ ఉండాలని, డివిజన్‌లోని ప్రతి ఇంటా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, సీనియర్ నాయకులు సోముల రాము యాదవ్, కొంపల్లి జగదీష్ నేత, జయమ్మ, కవిత, భాగ్యమ్మ, శేఖర్, రాజ్ కుమార్, రామకృష్ణ, శ్రీ నవదుర్గ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు మరియు యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బండ్లగూడ, కిస్మత్‌పూర్‌లో రూ.6.06 కోట్లతో అభివృద్ధి పనులు


సీసీ రోడ్లు, యూజీడీ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బండ్లగూడ (డివిజన్ 121), కిస్మత్‌పూర్ డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ రూ.6.06 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దర్గా ఖలీజ్ ఖాన్, ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ, ఓం నగర్, ఆనంద్ నగర్, బండ్లగూడ వార్డు కార్యాలయ రోడ్డు, ప్రశాంత్ నగర్ కాలనీతో పాటు కిస్మత్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో నూతనంగా సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలగడంతో పాటు డ్రైనేజీ సమస్యలు తగ్గి కాలనీల్లో మెరుగైన పారిశుధ్య పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

కందుకూరులో పట్టభద్రుల ఓటరు దరఖాస్తుల పరిశీలనపై శిక్షణ...!

పట్టభద్రుల ఓట్ల వెరిఫికేషన్ పై జిపిఓల కు దిశానిర్దేశం --- ఆర్ డి వో జగదీశ్వర్ రెడ్డి



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీ అధికారులు (జి పి వో), టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో జగదీశ్వర్ రెడ్డి పాల్గొని సిబ్బందికి అవగాహన కల్పించారు. పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తుల ధృవీకరణలో పాటించాల్సిన విధివిధానాలు, దరఖాస్తుదారుల అర్హతల పరిశీలన, ధ్రువపత్రాల వెరిఫికేషన్ పై సూచనలు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల బంధనలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరికీ జాబితాలో చోటు కల్పించేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, డీటీ (ఎన్నికలు) నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలు జన్మదిన వేడుకల్లో రక్తదానం

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 100 మంది నాయకులు, కార్యకర్తల రక్తదానం



క్రైమ్ మిర్రర్ మిర్యాలగూడ: చిలుకూరి బాలు జన్మదినాన్ని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అజారుద్దీన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) మాట్లాడుతూ.. చిలుకూరి బాలు జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన షేక్ అజారుద్దీన్‌ను అభినందించారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. చిలుకూరి బాలు సుఖసంతోషాలతో జీవిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, చిలుకూరి బాలు అభిమానులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

10 గురువారం 15-10-2026



మణికొండ జెడ్పీ హైస్కూల్‌లో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

గండిపేట(క్రైమ్ మిర్రర్): విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన భవన నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. పీఎంశ్రీ పథకం కింద 10 తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాలల్లో తరగతి గదులు, ఇతర సదుపాయాలు మెరుగుపడితే విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు అదనపు తరగతి గదులు అందుబాటులోకి వచ్చి, బోధనకు మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మణికొండ డివిజన్ అధ్యక్షులు శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మి శ్రీ, ఏర్పులకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుడ్డు ఆకాశ్

సబిత ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక



గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగి డివిజన్‌కు చెందిన రాజేంద్రనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుడ్డు ఆకాశ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం ఆకాశ్ బీఆర్ఎస్‌లో చేరడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మిగూడాలో దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్

గండిపేట్,(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మిగూడాలోని ఆర్‌జీకేలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ బుధవారం నాడు దర్శించుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు లక్ష్మీ రాజ్, సరికొండ దుర్గేష్, రవీందర్ యాదవ్, మంచర్ల చిరంజీవి, నీలం శ్రీనివాస్, యాదన్న, సాయికుమార్, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తుక్కుగూడ శ్రీశైలం హైవే, అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఉక్కుపాదం...!

టీపీవో సంతోష్ సింగ్ దూకుడు --- ఫుట్‌పాత్ ఆక్రమణలు నేలమట్టం....!

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా...కూల్చడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన వ్యాపారులు...





మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): మహేశ్వరం. నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని తుక్కుగూడ వార్డులో శ్రీశైలం హైవేపై అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. శంషాబాద్ జోన్ టీపీవో సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం భారీ కూల్చివేత చేపట్టారు.

100 ఫీట్ల రోడ్డు ఆక్రమణ.: 100 ఫీట్లు ఉండాల్సిన శ్రీశైలం ప్రధాన రహదారికి ఇరువైపులా కొందరు వ్యాపారులు ఫుట్ పాత్ ను ఆక్రమించి ఇష్టానుసారంగా రేకుల షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు వేశారు. దీంతో వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైవేపై నిత్యం ట్రాఫిక్ జామ్ లు, చిన్న చిన్న రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు టీపీవో సంతోష్ సింగ్ రంగంలోకి దిగారు. శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు ఆదేశాల మేరకు టీపీవో సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో నాలుగు జేసీబీలతో బుధవారం ఉదయం నుండే కూల్చివేతలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా నిలబడి టీపీవో సంతోష్ సింగ్ కూల్చివేతలను పర్యవేక్షించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ షెడ్లన్నింటినీ నేలమట్టం చేశారు.

నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారంటూ వ్యాపారుల ఆందోళన: కూల్చివేత సమయంలో వ్యాపారులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పండగ సమయంలో కనీసం ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా ఇలా కూల్చేయడం అన్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మాకు లక్షల్లో నష్టం వాటిల్లింది, మా గోడు ఎవరికి చెప్పుకోవాలి అంటూ వాపోయారు.


టీపీవో సంతోష్ సింగ్ వివరణ:

దీనిపై టీపీవో సంతోష్ సింగ్ స్పందిస్తూ.. ఇది వారి ప్రైవేట్ స్థలం కాదు, ప్రభుత్వ రోడ్డు స్థలం అని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని పర్మిషన్ లేకుండా ఆక్రమించినప్పుడు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 100 ఫీట్ రోడ్డును కాపాడటం, వాహనదారులకు, పాదచారులకు సౌకర్యం కల్పించడం కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నామని, అక్రమ కట్టడాలు ఎక్కడ ఉన్నా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయని, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

అరుణోదయ కాలనీ సమస్యలపై డిప్యూటీ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

పెండింగ్ రోడ్లు, వీధి దీపాలు, రోడ్డు ఆక్రమణలపై దృష్టి

గండిపేట(క్రైమ్ మిర్రర్): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన వన్ డే -- వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్--45 పరిధిలోని వార్డు నం.124, అరుణోదయ కాలనీలో డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి కాలనీలో నెలకొన్న పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనిచేయని వీధి దీపాలు, తగినంత వెలుతురు ఇవ్వని లైట్ల సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురాగా, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సింగిల్ ఆర్మ్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. అరుణోదయ కాలనీలో వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత శానిటేషన్, వెటర్నరీ విభాగాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా రహదారులను ఆక్రమిస్తూ నిర్మించిన ర్యాంపులు, పారపెట్ గోడలు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. స్థానికులు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుర్తించిన ప్రాంతాలను ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సదుపాయాలు కల్పించడంతో పాటు సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే 'వన్ డే -- వన్ వార్డ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ కార్తీక్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ అన్వేష్ రెడ్డి, ఏఈలు శ్రీనేష్, సంతోష్, వార్డు ఆఫీసర్ మంజుల, బిల్ కలెక్టర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కనువిందు చేసిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

హైదర్షకోట హిమగిరి కాలనీలో ప్రేక్షకులను అలరించిన బాల కళాకారులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీర్ పరిధిలోని హైదర్షకోట్ హిమగిరి కాలనీలో జై మాతాదీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి మండపం ప్రాంగణంలో నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన నయనానందంగా సాగింది. మయూరి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ గురువు ముట్నూరు శిరీష మార్గదర్శకత్వంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వస్త్రధారణ, చక్కటి హావభావాలు, లయబద్ధమైన నృత్య కదలికలతో బాల కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. సంగీతానికి అనుగుణంగా వారు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారుల ప్రతిభకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో భారతీయ శాస్త్రీయ కళలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నృత్య ప్రదర్శనలో వేణెలు ధేయ అంజలి, వేణెలు సాధ్వి అంజనా, గొట్టిముక్కుల శివాని, భావ్య మహాలక్ష్మి, నూకల మహతి శ్రీ, దుండాటి నిహిరా రెడ్డి, బోయలపల్లి జ్ఞాన, రాపోలు ఆద్య, కురిమిండ్ల సహస్రిత, కొంగరి వీక్ష, ఏలూరి సాన్విక, ఏలూరి లాస్విక తదితర చిన్నారులు పాల్గొని తమ నృత్యాలతో అలరించారు.కార్యక్రమంలో జై మాతాదీ యూత్ అసోసియేషన్ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొని బాల కళాకారులను అభినందించారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.